సస్పెన్షన్.. పోలీసుల్లో టెన్షన్!



- లష్కర్‌లో ముగ్గురు అధికారుల సస్పెండ్
- 10 మంది బదిలీ
- సిటీ కమిషనర్ చర్యలతో సివిల్ వ్యవహారాలకు దూరం

సికింద్రాబాద్: పోలీసులంటేనే మామూలుగా ఏదో ఒక భయం. నేరగాళ్లకు మాత్రం పోలీసుల పేరు వింటేనే గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి. పవర్ చూపించే అధికారి ఉండే పోలీసుస్టేషన్ల పరిధిలో భయం గురించి చెప్పనవసరం లేదు. కొన్ని రోజుల క్రితం వరకు సికింద్రాబాద్ ప్రాంతంలోనూ అదే పరిస్థితి ఉండేది. తాజాగా పోలీసు అధికారుల తీరు మొత్తం రివర్సయింది. ఫిర్యాదిదారులు, ప్రతివాదులు, నేరస్తులు ఎవరైనా.. విషయం ఏదైనా సరే.. పోలీస్‌స్టేషన్‌లో అడుగు పెడితే చాలు వారందరికీ పోలీసుల గౌరవ మర్యాదలు లభిస్తున్నాయి. నేరాలు, నేరగాళ్ల విషయంలో సైతం ఆచీతూచీ విచారణలు చేస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇందుకు కారణం సిటీ పోలీస్ కమిషనర్ తీసుకుంటున్న చర్యలే. ఒక హత్య కేసు విషయంలో నిర్లక్ష్యం వహించారనే కారణంతో ఏకంగా ముగ్గురు అధికారులను బాధ్యులను చేస్తూ సస్పెండ్‌వేయగా రెండు రోజులు గడవక ముందే ఈ ప్రాంతంలో పనిచేస్తున్న 10 మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ వేశారు.

ముగ్గురి సస్పెండ్‌తో కలవరం..

ఉత్తర మండలం పరిధిలోని గోపాలపురం పీఎస్ పరిధిలో ఇటీవల ఒక రియల్టర్ హత్య జరిగింది. ఇందుకు బాధ్యులైన నిందితులు అందరినీ పొరుగురాష్ట్రం నుంచి పట్టుకొట్టి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విషయంలో నిందితుల విచారణ, రిమాండ్ విషయంలో పోలీస్‌డైరీ నిబంధనలు పాటించలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇందుకు బాధ్యులుగా గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్‌ఐ దీక్షిత్‌రెడ్డిను సస్పెండ్ చేస్తూ సిటీ పోలీస్ కమిషనర్ మరుసటిరోజు మరో అడుగు ముందుకేసి గోపాలపురం ఏసీపీ ఎన్.సుధీర్‌పై కూడా సస్పెన్షన్ వేటు వేశారు. ఒక రియల్టర్ మర్డర్ విషయంలో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ సస్పెండ్‌కు గురి కావడం సికింద్రాబాద్ ప్రాంతంలో మొదటిసారి. ముగ్గురు అధికారుల సస్పెండ్ వ్యవహారం ఈ ప్రాంత పోలీసు అధికారులను కలవరపెడుతుంది.

ఆకస్మిక బదిలీలు..

సికింద్రాబాద్ నగర లా అండ్ ఆర్డర్ వ్యవహారాలు తూర్పు, మధ్య, ఉత్తర మండలాల డీసీపీల పరిధిలో ఉన్నాయి. ఇటీవల సిటీ పోలీస్ కమిషనర్ చేసిన బదిలీల్లో ఈ ప్రాంతం నుంచి చిలకలగూడ,లాలాగూడ, రాంగోపాల్‌పేట్, గాంధీనగర్, తిరుమలగిరి, మారేడుపల్లి, ఓయూ, బేగంపేట్, మారేడుపల్లి ట్రాఫిక్, చిలకలగూడ పోలీస్‌స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్లపై బదిలీవేటు పడింది. ఒకవైపు ముగ్గురు అధికారుల సస్పెండ్, మరోవైపు పదిమంది అధికారుల ఆకస్మిక బదిలీలు ఇక్కడి పోలీసు అధికారులను కలవరానికి గురి చేశాయి. బదిలీ అయిన 10 మంది ఇన్‌స్పెక్టర్లలో నలుగురికి మాత్రమే వేరే పోలీస్‌స్టేషన్‌లో అదే పోస్టు లభించింది. మిగతా వారంతా సైబర్ క్రైమ్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు, ఇంకొందరు డీఐలుగా బదిలీ అయ్యారు.

మారిన అధికారుల తీరు....

సిటీ పోలీస్ కమిషనర్ చర్యలు తీవ్రంగా ఉంటున్న క్రమంలో సికింద్రాబాద్ ప్రాంత పోలీసు అధికారుల తీరు మొత్తంగా మారింది. కమిషనర్ చర్యల ముందు వరకు దూకుడుగా వ్యవహరించిన అధికారులు కూడా ప్రస్తుతం నిదానంగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు పలు కేసుల్లో ఆచీతూచీ నిర్ణయాలు తీసుకుంటున్నారు. నెల క్రితం వరకు ఈ ప్రాంత పోలీస్ స్టేషన్లలో కుటుంబ పంచాయితీలు, భూ తగాదాలు, ఆస్తుల గొడవలు, ఆర్థిక వివాదాలకు సంబంధించిన ఫిర్యాదుదారులు, ప్రతివాదులే కనిపించేవారు. గత కొన్ని రోజులుగా ఇలాంటి సివిల్ వ్యవహారాల్లో పోలీసులు తల దూర్చడం లేదు. ఎవరిని మందలిస్తే ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతుంది. ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలు, మారుతున్న పోలీసు అధికారుల తీరుపట్ల ప్రజలు హర్షిస్తుండగా, అధికారుల్లో మాత్రం మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

నిరుపేదల సంక్షేమానికి కృషి



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: నిరుపేదల సంక్షేమానికి తాను ఎల్ల వేళలా కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన జువెరియా ఫాతిమాకు చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. లక్షకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా రాంగోపాల్‌పేట డివిజన్‌కు నల్లగుట్ట చుట్టలబస్తీకి చెందిన మహేష్ వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. నిరుపేదలకు అండగా ఉంటూ వారి సమస్యలను గుర్తిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, అత్తెలి అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



శ్రీరాంనగర్‌లో బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న అనితప్రభాకర్

రసూల్‌పురా: వచ్చే వేసవిలో కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా నియోజకవర్గ ఎమ్మెల్యే లాస్యనందిత చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే నిధులతో వివిధ వార్డుల్లో పవర్‌బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మూడవ వార్డు పరిధిలోని ఓల్డ్ మడ్‌ఫోర్ట్, శ్రీరాంనగర్ గాంధీనగర్ బస్తీల్లో తొమ్మిది లక్షల రూపాయల వ్యయంతో వేస్తున్న రెండు పవర్ బోర్‌వెల్స్ పనులను బోర్డు మాజీ సభ్యురాలు బి. అనిత ప్రభాకర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఓల్డ్ మడ్‌ఫోర్ట్, శ్రీరాంనగర్ బస్తీల్లో నీటి ఎద్దడితో బస్తీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పగానే ఎమ్మెల్యే లాస్యనందిత దృష్టికి తీసుకెళ్లగా బోర్‌వెల్స్ మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో సంధ్య, అనిల్, రమేష్, హనుమంతు, మధు, పటేల్, అశీష్ పాల్గొన్నారు.

ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న శ్రీరామ్ వెంకటేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్, రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ జాతీయ అవార్డు అందుకున్నారు. శుక్రవారం కన్యాకుమారిలో జరిగిన ఇస్రో కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ సిస్టమ్స్ ఫర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఐఎస్‌ఎస్‌ఈ) ఫెలోషిప్ మెంబర్– 2023 అవార్డును చైర్మన్ సోమనాథ్, మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇంజినీరింగ్ కాలేజీలో సంకలిత, త్రీడి ప్రింటింగ్‌ల తయారీ ఏర్పాటు, పరిశోధనల్లో ఆయన చేసిన సేవలకు అవార్డును అందచేసినట్లు అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అమీర్‌పేట: యూటర్న్ వద్ద మలుపు తిరుగుతున్న కారును ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా గార్ల గ్రామం, ఇందిరానగర్‌కు చెందిన వల్లపుదాసు రమేష్ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు.ఆయన కుమారుడు రాబిన్ కుమార్ (24) అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ బల్కంపేట ప్రశాంత్‌నగర్ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు.గురువారం రాత్రి స్నేహితుడు హరిచరణ్ తేజతో కలిసి ఫతేనగర్‌లో ఉండే మరో స్నేహితుడి వద్దకు వెళ్లారు.అర్ధ రాత్రి 1.30 సమయంలో బజాజ్ పల్సర్‌పై తిరిగి బల్కంపేటకు బయలుదేరారు.బల్కంపేట నుంచి అతి వేగంగా నిర్లక్ష్యంగా వచ్చి సాయిబాబా దేవాలయం సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొట్టి అదుపుతప్పి కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడిన రాబిన్ కుమార్‌ను అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.89,369 మాయం

అడ్డగుట్ట: క్రెడిట్ వార్షిక చార్జీలు రద్దు చేస్తామని అకౌంట్‌లో నుంచి డబ్బులు కాజేసిన ఘటన తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ దయాకర్ వివరాల ప్రకారం.. రైల్వే ఉద్యోగి రమణబాబుకు గత నెల 3న ఐసీఐసీఐ బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి ఓ గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మీ క్రెడిట్ కార్డు వార్షిక ఛార్జీలు రద్దు చేస్తామని అందుకు క్రెడిట్ కార్డు నంబర్‌తో పాటు ఫోన్‌కు వచ్చే ఓటీపీని చెప్పాలన్నాడు. నిజమని నమ్మిన రమణబాబు తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పగానే అతడి అకౌంట్‌లో నుంచి రూ.89,369 కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అవతలి వ్యక్తికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

దొంగతనాలు చేస్తున్న దంపతుల రిమాండ్



షేక్‌రియాజ్



షేక్‌సోనీ

సికింద్రాబాద్: రైల్వేస్టేషన్లలో తిష్ట వేస్తూ రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల నగలు, విలువైన ఆభరణాల దొంగతనాలకు పాల్పడుతున్న దంపతులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులకు సాధారణ తనిఖీలు చేపడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న బాపట్లకు చెందిన షేక్ రియాజ్ (22), అడ్డగుట్ట అంబేడ్కర్‌నగర్‌కు చెందిన స్రవంతి అలియాస్ షేక్‌సోనీ (20) దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఇరువురు అడ్డగుట్ట ప్రాంతంలో నివాసముంటూ రైల్వేస్టేషన్లలో చోరీలు చేయడం పనిగా పెట్టుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వారు పాల్పడిన రెండు నేరాలకు సంబంధించి వారి నుంచి 114 గ్రాముల బంగారు, 10 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మెస్ ప్రారంభించాలని 'లా' విద్యార్థుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: లా విద్యార్థుల ఈ–2 హాస్టల్ మెస్‌ను ప్రారంభించాలని, పెంచిన ఫీజులను తగ్గించాలని శుక్రవారం ఓయూ లా విద్యార్థులు పరీక్షలు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. గత 8 నెలల నుంచి మెస్‌ను ప్రారంభించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రెండు సంవత్సరాలుగా నెల వారి మెస్ బిల్లులను వెల్లడించకుండా ఒకేసారి రూ. 30 వేల నుంచి రూ.40 వేల మెస్ బిల్లులు వేశారని పేర్కొన్నారు. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల ఫీజులను రూ. 5 వేల నుంచి రూ.16 వేలకు పెంచడం దారుణమన్నారు. సెమిస్టర్ పరీక్ష ఫీజును సైతం రూ.1200 నుంచి రూ.1500 వరకు పెంచడంతో అధిక ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్నామని మెస్సులను ప్రారంభించి, ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు విద్యార్థులను అరెస్ట్ చేశారు.

వర్సిటీల సమస్యలపై సీఎంతో చర్చిస్తాం



మాట్లాడుతున్న ప్రొ.కోదండరామ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ అన్నారు. శుక్రవారం ఓయూ దూరవిద్య కేంద్రంలో ఆడిటోరియంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (టీఏయూటీఏ) ఆధ్వర్యంలో ఉన్నత విద్య, యూనివర్సిటీల సమస్యలు–పరిష్కారాలు అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి టీఏయూటీఏ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గడ్డం మల్లేశం అధ్యక్షత వహించగా ప్రొ.కోదండరామ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ వర్సిటీల అధ్యాపక సంఘం నాయకులు ఉద్యోగ విరమణ వయోపరిమితి పెంపు, హెల్త్ కార్డులు, సీపీఎస్, లేదా ఓపీఎస్ అమలు తదితర అంశాలతో పాటు ఆయా వర్సిటీల సమస్యలను వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నేడు విశ్వవిద్యాలయాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. వర్సిటీలలో తొలుత అధ్యాపక ఖాళీలు భర్తీ చేయాల్సిన అవసరం ఉందని సీఎంతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని విషయాలు చర్చించనున్నట్లు హామీ ఇచ్చారు. ప్రొ.శ్రీనివాస్, ప్రొ.చంద్రునాయక్, డా.చల్లమల్ల వెంకటేష్ పాల్గొన్నారు.

అపార్టుమెంట్‌కు దారి ఏర్పాటుపై ఆందోళన



దారి కోసం కూల్చిన గోడ

లాలాపేట: తార్నాలోని ఉమ సిగ్నేచర్ పేరుతో చాలా కాలం క్రితం నిర్మాణం చేసిన బహుళ అంతస్తుల అపార్టుమెంట్‌కు కొత్తగా హనుమాన్‌నగర్‌లో నుంచి దారి ఏర్పాటు చేయడంపై శుక్రవారం స్థానికులు ఆందోళన చేపట్టారు. అపార్టుమెంట్ నిర్మాణం ప్రారంభంలో లేని దారి ఇప్పుడు కొత్తగా ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని అపార్టుమెంట్ వాసులను హనుమాన్‌నగర్ ప్రజలు అడ్డుకున్నారు. అప్పటికే కొంత మేర అడ్డుగా ఉన్న గోడను అపార్టుమెంట్ వాసులు కూల్చి వేశారు. దీంతో స్థానికులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలకు సూచించారు. హనుమాన్‌నగర్ వాసులు మట్లాడుతూ.. వందల సంఖ్యలో ఉన్న ప్లాట్ల వారు హనుమాన్‌నగర్ నుంచి రాకపోకలు సాగిస్తే తమకు అన్ని విధాలుగా ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీ మధ్యలో నుంచి ఎట్టి పరిస్థితుల్లోను దారి ఏర్పాటు చేయడానికి వీలు లేదని తేల్చిచెప్పారు.

చరిత్ర, నాగరికతల స్ఫూర్తితో భవిష్యత్ భారతాన్ని నిర్మించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌మాధవ్

లాలాపేట: చరిత్ర, సంస్కృతి, నాగరికతల స్ఫూర్తితో 2047 నాటికి భవిష్యత్ భారతం కోసం మనల్ని మనం పునర్నిర్మించుకోవాలని ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు రామ్‌మాధవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్(ఏబీఆర్‌ఎస్‌ఎం) తెలంగాణ యూనిట్, అసోసియేషన్ ఫర్ ప్రమోటింగ్ ఇండిక్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ (ఏఏస్పీ ఆర్‌ఐఈ) భాగస్వామ్యంతో వాయిస్ ఆఫ్ హైదరాబాద్ అకడమీషియన్స్ ఆధ్వర్యంలో జరిగిన 'షేపింగ్ ది డెవలప్డ్ భారత్ ఇన్‌సెట్స్ ఫర్ 2047' అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఏబీఆర్‌ఎస్‌ఎం సంయుక్త ఆర్గనైజింగ్ కార్యదర్శి గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ.. విధానపరమైన అంశాలను ప్రభావితం చేయడంలో మేధావుల సంఘం పాత్ర ఎంతో కీలకమని ఇలాంటి వేదికల ద్వారా నిర్వహించే సమావేశాలు ప్రపంచ వేదికపై భారత్ పునరుజ్జీవనాన్ని ముందుకు నడిపిస్తుందన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదల పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి విమర్శించారు. కార్పొరేట్ శక్తుల రుణాలను మాఫీ చేసేందుకు మోదీ ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ దినోత్సవాన్ని పురస్కరించుకొని దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అబద్దాల పుట్ట అని, కార్పొరేట్ శక్తులకు రూ. 25 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ, విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించకుండా ప్రజా బడ్జెట్ అని అబద్దాలు ఆడుతుందని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించాలని అలాగే పట్టణ ఉపాధి హామీని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో గత సంవత్సరం రూ. 89 కోట్లు ఖర్చు చేసిన కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 86 కోట్లు కేటాయించి 26 శాతం నిధులు పెంచామనేది పచ్చి అబద్దామని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకే ఆన్‌లైన్ హాజరు, ఆధార్ లింక్ విధానాన్ని తీసుకువస్తూఎత్తి వేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జాతీయ నాయకులు ఎస్.జీవన్‌కుమార్, ఉపాధి హామీ పరిశోధకులు చక్రధర్ బుద్ధా, డిబిఎఫ్ జాతీ కార్యదర్శి పి.శంకర్, మీరా సంగమిత్ర, పులి కల్పన, ఇందిర, ఫిరోజ్, మనోహర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కుందన్‌బాగ్, ఐడీపీఎల్, గ్రీన్‌ల్యాండ్స్ ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బీఎస్ మక్తా, హస్సేన్‌నగర్, నిషాంత్‌బాగ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుభానీ మసీద్ ఏరియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, శాంతి శిఖర అపార్ట్‌మెంట్స్, అయ్యప్ప టెంపుల్ లేన్, చర్చిగల్లీ, టీవీఎస్ షోరూమ్ లేన్, స్వాతి టిఫిన్స్ వెనుక కాలనీ. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్, రాధాసూపర్ మార్కెట్, మెరిడియన్ ప్లాజా, నీరజ్ పబ్లిక్ స్కూల్ లేన్, ఆర్‌బీఐ క్వార్టర్స్, స్వప్న నర్సింగ్ హోం, నిషాంత్‌బాగ్, కీర్తిలాల్ జ్యువెలర్స్, బాబుఖాన్ మాల్, అమృత మాల్, మూసాపేట మెయిన్‌రోడ్డు, జెక్‌కాలనీ ఇంద్రప్రస్థా బిల్డింగ్, బేగంపేట ఉమానగర్, వామన్ నాయక్ లేన్, చిన్మయ స్కూల్, ట్రాన్సిస్ట్ హాస్టల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేడు అనఘావ్రతం

సనత్‌నగర్: పుష్య మాసం బహుళ అష్టమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో శ్రీదత్తాత్రేయ స్వామి వారి దేవాలయంలో శనివారం (నేడు) ఉదయం 9.30 గంటలకు అనఘావ్రతం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు.

ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్



అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పొలిసెట్టి సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన రాంప్రసాదరావును బదిలీ చేయగా బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసే సతీష్‌ను ఎస్‌ఆర్‌నగర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్ పని చేశారు.

రేపు ఇంద్రాసేనారెడ్డికి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డికి రేపు (4న) ఓయూలో సన్మానం జరగనుంది. ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం, ఉస్మానియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డా.విజయ్‌కుమార్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

శుభాకాంక్షలు

లాలాపేట: తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ప్రజాపతిని శుక్రవారం బీజేపి జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న ప్రజాపతి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడూరి శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్, టెంపుల్ సాయి పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో గత నెలలో సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఆసరా ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ జగన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ: జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కులగణన చేపడుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఓయూలో పీహెచ్‌డీ చేస్తున్న ఓబీసీ విద్యార్థులకు ప్రతి నెల ఫెలోషిప్‌లను రూ.10 వేల వరకు పెంచాలని అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్) జాతీయ అధ్యక్షులు జి.కిరణ్‌కుమార్ కేంద్రాన్ని కోరారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌తో పాటు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నెల్లి సత్య, లెనిన్, దివ్యరాయ్, ఎస్‌ఎఫ్‌ఐ నేత రవినాయక్, ఆంజనేయులు, ఎన్‌ఎస్‌యూఐ నేత వికాస్‌యాదవ్ పాల్గొన్నారు.

బీసీ నేతకు భారతరత్న సంతోషకరం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

కంటోన్మెంట్: బహుజన నేత కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న అవార్డు దక్కడం సంతోషకరమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిట్ల నాగేశ్ అన్నారు. ఓబీసీ నేతకు దేశ అత్యున్నత పురస్కారం దక్కేలా సిఫారసు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. నాయీ బ్రాహ్మణ వర్గానికి చెందిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న దక్కడం తమ వర్గానికి గర్వకారణమని కంటోన్మెంట్ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు హనుమంత్ అన్నారు. కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, జగన్, వీరేందర్, రాజ్‌గోపాల్, లక్ష్మీ నర్సింహ, తిరుమలేశ్, శివశంకర్, బాలరాజ్, భాస్కర్, యాదగిరి, చంద్రకాంత్, మాణిక్యం అన్నారు.

సన్మానం



సోమ్లా నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: ఇటీవల పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన కేతావత్ సోమ్లా నాయక్‌ను హబ్సిగూడలోని ఆయన నివాసంలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెపారు. లంబాడా జాతులను జాగృతం చేస్తూ వారిని విద్యా, ఆధ్యాత్మిక రంగాల వైపు మళ్లించేందుకు సోమ్లానాయక్ చేసిన కృషి అభినందనీయమని ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. సాహిత్యరంగంలో కళాకారుడిగా సోమ్లానాయక్‌కు పద్మశ్రీ అవార్డు దక్కడంపై హర్షణీయమన్నారు.

ఎంపీ టికెట్‌కు దరఖాస్తు



చనగాని దయాకర్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ భువనగిరి ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నట్లు ఓయూ విద్యార్థి నేతల టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తను ఉద్యోగాల భర్తీ కోసం ఎన్నో ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలో గౌడ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నందున ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేస్తాం



నియామక పత్రాలు అందుకుంటున్న లింగయ్య, తులసీరామ్

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన ఆలకుంట లింగయ్య సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా, బీ.తులసీరాం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను డీసీసీ అధ్యక్షులు ఎం. అనీల్‌కుమార్ ఇటీవల జారీ చేయగా శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తామన్నారు.

మార్చిలో పీజీ డిప్లొమా లా కోర్సుల పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కొనసాగుతున్న పీజీ డిప్లొమా లా కోర్సుల సెమిస్టర్ పరీక్షలు మార్చిలో జరగనున్నట్లు అధికారులు శుక్రవారం పేర్కొన్నారు. ఆరు డిప్లొమా కోర్సుల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ 1, 2 సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 15 వరకు, రూ.100 అపరాధ రుసుంతో 22 వరకు ఫీజు చెల్లించాలన్నారు.

అక్రమ కట్టడాలను ఉపేక్షించం

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిష్టఫర్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిష్టఫర్ చెప్పారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణదారులు, యజమానులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టరాదని అనుమతి ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని అక్రమ కట్టడాలను గుర్తించి కూల్చివేస్తున్నామన్నారు. తమ పరిధిలో నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే అనుమతి పత్రాలను అందజేస్తున్నామన్నారు. భవన నిర్మాణాల విషయంలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా వ్యవహరిస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందిస్తున్నామని ఏసీపీ క్రిష్టఫర్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తూ ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నామని వివరించారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని హైదర్‌బస్తీ తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధం చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశామన్నారు.

నేడు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

శ్రీనగర్‌కాలనీ: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారి కోసం శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఐవీవై ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2024ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన యూనివర్సిటీల ప్రతినిధులు హాజరై ఆయా యూనివర్సిటీల వివరాలను వెల్లడిస్తారన్నారు. ఔత్సాహిక విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకుంటే, ఉచితంగా రిజిస్ట్రేషన్ నిమిత్తం ఫోన్స్: 70557 27272, 91054 91054లలో సంప్రదించాలన్నారు.